క్లుప్తంగా

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొలిమిగుండ్లలో పది రోజులుగా సాగిన కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ముగిశాయి. స్థానిక లలితా సుందరేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని ప్రతిమకు త్రైత సిద్ధాంత భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు శ్రీకృష్ణుడి ప్రతిమను పల్లకిపై కొలువుంచి వీధుల్లో ఊరేగించారు. ఎస్‌ఐ రమేష్‌రెడ్డి చేరుకొని స్వామికి ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత కొలిమిగుండ్ల శాఖ సభ్యులు పీఎల్‌ఎం నాయుడు, రామకృష్ణారెడ్డి, హరి, నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం



శ్రీకృష్ణుని పల్లకీ సేవ దృశ్యం

ప్యాపిలి: శ్రీకృష్ణ జన్మాష్టమి ముగింపు వేడుకల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో నిర్వహించిన శ్రీకృష్ణుని గ్రామోత్సవం శోభాయమానంగా సాగింది. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కృష్ణాష్టమి రోజున పట్టణంలో శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేశారు. పది రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం శుక్రవారం ముగింపు వేడుకలు నిర్వహించారు. జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు తదితరులు స్వామివారిని దర్శించుకుని పల్లకీ మోశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కేశవులు, వెంకటరమణ, రామాంజనేయులు, రాఘవేంద్ర, శివ,రమేష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



బాధితురాలికి నగదు అందిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం గ్రామానికి చెందిన చాకలి సుబ్బరాయుడు కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10 వేలను మృతుడి భార్య లక్ష్మీదేవికి శుక్రవారం ఎంపీడీఓ ప్రసాద్ రెడ్డి అందజేశారు. ఇటీవల సుబ్బరాయుడు ఉమ్మాయిపల్లెలో పని ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా బెలుం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది నరేష్, లావణ్య, సుబ్రహ్మణ్యం నాయక్, పర్వేజ్, వలంటీర్ రంగస్వామి పాల్గొన్నారు.

టంగుటూరు పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రామ్ మానిటరింగ్ ఆఫీసర్

బనగానపల్లె: మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం జిల్లా ప్రోగ్రామ్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీమంత్ తనిఖీ చేశారు. ఓపీ, ల్యాబ్, స్టాక్ రిజిస్టర్స్ తదితర రికార్డులను పరిశీలించారు. ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడుకు సూచించారు. అలాగే నేటి నుంచి జరుగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు.

పాఠశాల, కమ్యూనిటీ భవనాల ప్రారంభోత్సవం



కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించిన దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని లక్ష్మీతండాలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో రూ. 15 లక్షలతో పాఠశాల భవనం, కమ్యూనిటీ భవనాన్ని నిర్మించారు. శుక్రవారం ఈ భవనాలను ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో రాచర్ల ఎస్‌ఐ హుసేన్ బాషా ప్రారంభించారు. మారుమూల గ్రామాల అభివృద్ధికి ఆర్డీటీ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సదర్భంగా ఎస్‌ఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేషయ్య, ఆర్‌ఈ షఫి తదితరులు పాల్గొన్నారు.

సులువైన...పౌర సేవలు

- సేవా నిలయాలుగా పేరొందుతున్న సచివాలయాలు
- మండల కేంద్రాలకు వెళ్లకుండానే ఉన్న ఊర్లోనే అన్నిరకాలా పత్రాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు

సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు అందరి మన్ననలు పొందుతున్నాయి. ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ వ్యవస్థలు అందజేస్తున్న పౌరసేవలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సేవలు చాలా సులువుగా అందుతున్నాయని సంతోషంగా చెబుతున్నారు. ప్రతి గ్రామంలో నెలకొల్పిన సచివాలయ భవనాలు పల్లెలకు కొత్తశోభ తెచ్చాయి. ఉన్న ఊర్లోనే అన్నిసేవలు అందుతుండడంతో సేవా నిలయాలుగా పేరొందుతున్నాయి సచివాలయాలు. సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్వరాజ్యం స్థాపన దిశగా ముందుకు సాగారు. ప్రతి 2వేల జనాభకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఒక్కో భవనాన్ని రూ. 40లక్షలతో నిర్మించారు. అదేవిధంగా ప్రతి సచివాలయానికి 10–12 వరకు వివిధ శాఖల అధికారులను నియమించింది ప్రభుత్వం. పౌర సేవలు నేరుగా అందజేసేలా ఆదేశాలు జారీ చేయడంతో సచివాలయాల్లో వివిధ రకాల 547 సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని 83 సచివాలయాలకు సంబంధించి నూతన భవనాలకు రూ.33.20కోట్లు ఖర్చు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.



ముదిగేడు సచివాలయంలో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్న దృశ్యం (ఫైల్)

బనగానపల్లె నియోజకవర్గంలో నూతనంగా నిర్మితమైన సచివాలయ భవనాలు వివరాలు

మండలం	సచివాలయాలు
బనగానపల్లె	25
కొలిమిగుండ్ల	16
కొవెలకుంట్ల	12
అవుకు	18
సంజామల	11

ప్రజలకు నేరుగా అందుతున్న సేవలు

ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా పౌరులకు నేరుగా సేవలు అందుతున్నాయి. సామాజిక పింఛన్, ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు నేరుగా మంజూరువుతున్నాయి. ఎవరి సిఫారసు లేకుండా అర్హత ఉంటే చాలు నిర్ణీత గడువులోపు మంజూరు చేస్తున్నారు సచివాలయాల ఉద్యోగులు. రైతుభరోసా, అమ్మఒడి, చేయూత, చేదోడు, ఆసరా, పక్కగృహాలు, ముటేషన్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తదితర సేవలు నేరుగా అందుతున్నాయి. సొంత ఊరిలోనే ప్రజలు తమకు వీలైనప్పుడే సచివాలయాలకు అలా వెళ్లి...పనిముగించుకుని ఇలా వస్తున్నారు. ఏదైనా ప్రభుత్వ పథకం వర్తించకుంటే... ఎందుకు అనే విషయాన్ని డైరెక్ట్‌గా దరఖాస్తుదారుడికి సచివాలయ సిబ్బంది వివరిస్తున్న తీరుపై సర్వత్రా సంతోషం వ్యక్తం చేస్తున్నారు గ్రామీణులు.



ముదిగేడు గ్రామం నూతన సచివాలయ భవనం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సచివాలయాల ఏర్పాటుతో ప్రజలకు వ్యయ, ప్రయాసాలు పూర్తిగా తగ్గిపోయాయి. గ్రామంలోనే ప్రజలకు అవసరమైన సేవలు దాదాపు అందుతున్నాయి. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నాం . దరఖాస్తుదారులకు సంక్షేమ పథకాలు ఎందుకు వర్తించలేదనే విషయాన్ని అప్పటికప్పుడు సచివాలయ ఉద్యోగులు వివరిస్తున్నారు. దీంతో ప్రజలు కూడా సమస్యను అర్థం చేసుకుంటున్నారు. సచివాలయ సేవలపై ప్రజలు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. –నాగకుమార్.ఎంపీడీఓ, సంజామల

ఏడు నెలలకే వితంతు పింఛన్ మంజూరు



నా భర్త పుల్లయ్య ఏడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కూలీ పనులతో జీవనం సాగిస్తున్నాం. దిక్కుతోచని పరిస్థితుల్లో వలంటీర్ ద్వారా పింఛనీకు దరఖాస్తు చేసుకున్నా. ఆ విషయం కూడా మరిచిపోయా. వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి వితంతు పిఛన్ మంజూరైందని చెప్పగా ఆశ్చర్యానికి గురయ్యా. ఇంత త్వరగా వస్తుందని అస్సలు ఊహించలేదు. గతంలో పింఛన్ కోసం చాలా మంది దరఖాస్తు చేసుకుని మండల కేంద్రాలకు తిరిగిన సందర్భాలు చాలా చూశా. తనకు ఇప్పుడే రాదనుకున్నా. ఏడు నెలలకే పింఛన్ మంజూరు చేసిన ప్రభుత్వ సాయాన్ని మరువం.

– సుజాత, నొస్సం గ్రామం

సచివాలయ సేవలు బాగున్నాయి



సచివాలయాల సేవలు చాలా బాగున్నాయి. ఉన్న ఊర్లోనే అన్ని సేవలు అందుతున్నాయి. సచివాలయాల ఉద్యోగుల ద్వారా సమాచారం కూడా పూర్తిగా లభిస్తుంది. నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా అందుతున్న రూ. 24 వేల సాయం మా కుటుంబానికి ఆసరగా నిలిచింది. అలాగే నా కుమారుడికి అమ్మఒడి పథకం ద్వారా 15 వేలు సాయం అందుతుంది. ఈ పథకాలన్నీ ఎక్కడికి వెళ్లకుండానే వర్తించాయి. ప్రత్యేకించి పింఛన్ పంపిణీ అద్భుతం. గతంలో లబ్ధిదారులు చాలా ఇబ్బంది పడేవారు. ఇళ్ల వద్దకే సేవలు అందజేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– పొణ్యం ఆదినారాయణ, సంజామల మండలం, ఆకుమల్ల గ్రామం

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

- డిపో మేనేజర్ శశిభూషణ్



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అన్ని విధాలుగా సురక్షితమని, ప్రతిఒక్కరూ ఆర్టీసీ అభివృద్ధికి తమవంతు సహకారం అందజేయాలని డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులను ప్రోత్సహించేందుకు గత 15 రోజులుగా కర్నూలు–డోన్ పల్లె వెలుగు బస్సుల్లో ఏర్పాటు చేసిన డిప్ బాక్స్‌ల్లోని టిక్కెట్లను శుక్రవారం ఆయన స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికుల సమక్షంలో డిప్ తీసి ముగ్గురు విజేతలను ప్రకటించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరసగా ఆర్‌వీ రమణ, బాలకృష్ణ, నరసప్పకు డీఎం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

నాడు నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ప్యాపిలి: మండలంలో రెండో విడత కింద చేపడుతున్న మన బడి నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సర్వశిక్ష అభియాన్ డీఈ ఈశ్వరయ్య ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని సిద్దనగట్టు, బూరుగల, రాచర్ల తదితర పాఠశాలల్లో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. హెచ్‌ఎంలు నాడు నేడు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్ నాయక్, ఏఈ గుప్త తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

డోన్ : వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఇందుకు వినాయక ఉత్సవ కమిటీకి తమవంతు సహకారం ఉంటుందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో విశ్వహిందూ పరిషత్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా ముఖ్య కార్యదర్శి నాగఫణిశాస్త్రీ, జిల్లా అధ్యక్షుడు సందడి సుధాకర్, ఉపాధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, రమాకృష్ణ, సహాయ కార్యదర్శి రాజేష్, బీజేపీ నాయకులు సందు రమణ, హనుమంతరెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

పోలీసు అనుమతి తప్పనిసరి

డోన్ టౌన్ : వినాయక చవితి సందర్భంగా మండపాల్లో విగ్రహాలు ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐలు శరత్‌కుమార్ రెడ్డి, నగేష్‌లు తెలిపారు. మండపం ఏర్పాటు చేసే వారు కనీసం ఐదుగురు గ్రూపుగా ఏర్పడి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. విగ్రహం ఏర్పాటు, ఎన్ని రోజులు పూజలు, నిమజ్జనం తేదీ, రూటు తదితర వాటి వివరాలు అందించాలన్నారు. మండపాలకు విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు.

బేతంచెర్ల: మండలంలో పోలీసుల అనుమతి లేకుండా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయవద్దని సీఐ ప్రియతం రెడ్డి శుక్రవారం తెలిపారు. నిర్వాహకులు పోలీసు స్టేషన్‌ల్లో అనుమతులు తీసుకున్నాకే విగ్రహాలను మండపాల వద్దకు తెచ్చుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి



మోక్షగుండం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న తాఫీ మేస్త్రీల సంఘం నాయకులు, కార్మికులు

బనగానపల్లెరూరల్ : ప్రతి ఒక్కరూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తి గా తీసుకోవాలని బనగానపల్లె తాఫీ మేస్త్రీల సంఘం గౌరవాధ్యక్షులు, సివిల్ ఇంజినీర్ మక్బుల్ హుస్సేన్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ యూనానీ వైద్యశాల సమీపంలోని ఎండీహెచ్ కాంప్లెక్స్‌లో శ్రీ మోక్ష గుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఇంజనీర్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణానికి చెందిన ఆర్‌అండ్‌బీ రిటైర్డ్ ఇంజినీర్లు అలీబేగ్, అక్బార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మహబూబ్‌వలి, తాఫీ మేస్త్రీ సంఘం నాయకులు బాబు, షేక్షావలి, మహబూబ్ బాషా, ప్రసాద్, ఎన్టీఆర్, ఖురేషి, నరేష్, జీఎం దస్తగిరిబాషా, సతీష్, నూర్‌హమీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కోవెలకుంట్ల: ఇంజినీర్‌గా మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని మోక్షగుండం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఇంజినీర్‌గా మోక్షగుండం విశిష్ట సేవలందించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణదాస్, నాగేశ్వరరెడ్డి, రాజు, గురువయ్య, అన్నపూర్ణ, లక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.



పాతపేట హైస్కూల్లో విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రాజెక్టుల రూపకర్త విశ్వేశ్వరయ్య

డోన్ టౌన్ : ప్రాజెక్టుల రూపకర్త మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని హెచ్‌ఎం పద్మావతి అన్నారు. ఇంజినీర్ల దినోత్సవం పురష్కరించుకొని శుక్రవారం పాతపేట హైస్కూల్లో విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి హెచ్‌ఎంతోపాటు సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సీఎం జగనన్న పర్యటన విజయవంతం చేద్దాం




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

డోన్ : డోన్‌లో ఈ నెల 19వ తేదీన జరిగే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు ప్రజలు పిలుపునిచ్చారు. శుక్రవారం మంత్రి బుగ్గన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సీఎం పర్యటనపై ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మండల, పట్టణ అధ్యక్షులు రామచంద్రుడు, హరితో కలిసి ఆయన చర్చించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ గత ఎన్నికల తరువాత డోన్ నియోజకవర్గంలో పర్యటించడం సీఎం మొట్ట మొదటిసారి అన్నారు. మంత్రి బుగ్గనన రాజేంద్రనాథ్‌రెడ్డికి గతంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం డోన్‌ను రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారన్నారు. కరువు కాటకాలతో తాగేందుకు నీరు దొరక్కని నియోజకవర్గంలోని అన్ని చెరువులను హంద్రీనీవా నీటితో నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు సీఎం వస్తున్నారన్నారు. రూ.2300 కోట్లతో డోన్ నియోజకవర్గాన్ని విద్య,వైద్య, ఉపాధి వ్యవసాయ రంగాల్లో అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఈలాంటి తరుణంలో డోన్‌కు విచ్చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అఖండ స్వాగతం పలికేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోట్రికె హరికిషన్, జాకీర్, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, నాయకులు ఆర్‌ఈ రాజవర్ధన్, మల్యాల శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పరిరక్షణకు కృషి చేయాలి

బనగానపల్లెరూరల్ : ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నేషనల్ గ్రీన్‌కోర్ రీజనల్ కో ఆర్డినేటర్ కుమార్‌బాబు కోరారు. శుక్రవారం మండలంలోని ఇల్లూరుకొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓజోన్ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన, వకృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభకనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాల అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం పాండురంగారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సూర్యుని నుంచి వెలువడే అతి శక్తి వంతమైన అతినీలలోహిత కిరణాలను శోషించుకొని సకల జీవకోటికి రక్షణ ఇచ్చేదే ఓజోన్ పొర అన్నారు. ఈ ఓజోన్ పొర కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, మొక్కలు నాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాము, ఆనందసుశీల, రషీదా బేగం, సుధాకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన దృశ్యం

చురుగ్గా సీఎం బహిరంగ సభ ఏర్పాటు పనులు

- పరిశీలించిన ఆర్డీఓ, డీఎస్పీ

డోన్ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19వ తేదీన డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు నియోజకవర్గ కేంద్రం డోన్‌లో జరిగే బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం ఏర్పాట్లను ఆర్డీఓ వెంకటరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. వెంకటనాయునిపల్లె రహదారి పక్కన ఉన్న సర్పంచ్ శేఖర్‌నాయుడు పొలంలో బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. సమీపంలోని మర్రి రమణ పాత ఇంజినీరింగ్ కళాశాల భవనం వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు జిల్లా, కృష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామం వద్ద హంద్రీ నీవా కాలువపై నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా కాలువ నీటితో చెరువుల నింపే కార్యక్రమం ప్రారంభించిన అనంతరం సీఎం నేరుగా హెలికాప్టర్‌లో డోన్ చేరుకుంటారు. అనంతరం బహిరంగ సభకు హాజరవుతారు. అదేవిధంగా బహిరంగ సభ ఏర్పాటు పనులను రాష్ట మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మండల పార్టీ కన్వీనర్ రామచంద్రుడు మంత్రి పీఏలు మహేశ్వర రెడ్డి, రమేష్ రెడ్డి తదితరులు పరిశీలించారు.



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

అనారోగ్యం కట్టడికి జగనన్న ఆరోగ్య సురక్ష

సంజామల: పేదల అనారోగ్యం కట్టడికి రాష్ట ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టుందని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలోని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జయంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఆశావర్కర్లు,సచివాలయ ఆరోగ్య సిబ్బందికి శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్షపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లడుతూ వలంటీర్లు, ఆశా కార్యకర్తలు, సచివాలయ ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధుల కలవారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆకుమల్ల పీహెచ్‌సీ వైద్య సబ్ యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్, ల్యాబ్ టెక్నిషియన్ హుశేన్ వలి, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

డోన్ రూరల్ : రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిన్నమల్కాపురం పీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యులు డాక్టర్ అఖిల్ సూచించారు. మండల పరిధిలోని గుమ్మకొండలో శుక్రవారం ప్రజల వివరాలు సేకరించే కార్యక్రమాన్ని డాక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష గురించి సచివాలయ పరిధిలోని వలంటరీలకు తమకు కేటాయించిన గృహలలోని సభ్యులదంరికీ తెలియ జేయాలన్నారు. అలాగే ప్రజల ఆరోగ్య వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చెన్నయ్య, ఏఎన్‌ఎం జగదీశ్వరి, సచివాలయ సెక్రటరీ యమున, ఆశా వర్కర్ శాంతి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కామేశ్వరావు

కొలిమిగుండ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించే మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి సూచించారు.శుక్రవారం బెలుంలో ఆరోగ్య సురక్షపై వలంటీర్లు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు చేస్తున్న ఇంటంటి సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని వివరాలను రిజిష్టర్ చేయాలని సూచించారు. 30 తేది నుంచి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. రోగులకు పైసా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

సంక్షిప్తం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లెరూరల్ : బనగానపల్లె మండలంలో విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. పాతపాడు, పసుపలతోపాటు బనగానపల్లె పట్టణాల్లో ఉన్న సబ్ స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. మధ్యాహ్నం నుంచి సరఫరాను యథావిధిగా సరఫరా చేస్తామన్నారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్‌ల్లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీ మధు సూదన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పారిశ్రామిక వేత్తలు, రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

జగనన్న గోరుముద్దను సక్రమంగా నిర్వహించాలి

ప్యాపిలి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో వెంకటేశ్ నాయక్ ఆదేశించారు. మండల పరిధిలోని సిద్దనగట్టు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లెలో నాటుసారా విక్రయిస్తున్న మద్దమ్మ, బాలరాజు, రాధను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శివశంకర్ నాయక్ తెలిపారు. నిందితుల నుంచి 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

అదృశ్యమైన విద్యార్థి గుర్తింపు.. తల్లిదండ్రులకు అప్పగింత

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతూ మూడు రోజుల క్రితం అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యమైంది. శుక్రవారం ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. నంద్యాల పట్టణంలోని నందమూరినగర్ కాలనీకి చెందిన నిర్మల కుమారుడు చందు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ అక్కడే హాస్టల్‌లోఉంటున్నాడు. బుధవారం ఉదయం స్కూల్‌బ్యాగులో బట్టలు సర్దుకుని హాస్టల్ నుంచి స్కూల్‌కు బయలుదేరి అదృశ్యమయ్యాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. నంద్యాలలో తిరుగుతుండగా గుర్తించిన పోలీసులు ఆ విద్యార్థిని తీసుకొచ్చి తల్లికి అప్పగించారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఏడు కపిలేశ్వరబావి సమీపంలో నూతన శివాలయ నిర్మాణానికి శుక్రవారం దాతలు విరాళం అందజేశారు. పట్టణానికి చెందిన మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, గడ్డం రామకృష్ణారెడ్డి తమ వంతుగా రూ. 20 వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

30వ తేదీ వరకు పంట నమోదుకు గడువు

బేతంచెర్ల: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదుకు ఈనెల 30 వరకు గడువు పెంచినట్లు ఏఈ కిరణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఇంతవరకు మండలంలో 81 శాతం పంట నమోదు జరిగిందన్నారు. మిగతా రైతుల వెంటనే రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదుతో నష్ట పరిహారం, బీమా, సున్న వడ్డీకి పంట రుణాలు, మద్దతు ధర తదితరాలు వర్తిస్తాయన్నారు.

వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు

డోన్ టౌన్ : పట్టణంలోని వైయస్ నగర్‌లో ఉన్న హోసన్నా వృద్ధాశ్రమంలో జీవనం సాగిస్తున్న రామదుర్గం గ్రామానికి చెందిన వృద్ధురాలు కాలమ్మ(70) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆశ్రమ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ విన్నపం మేరకు ద్రోణాచలం సేవా సమితి ఆత్మబంధువులు వృద్ధురాలి మృతదేహానికి హిందూ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణానికి చెందిన రాజయ్యగౌడ్, చంద్రశేఖర్‌రావు ఆర్థిక సాయం చేసినట్లు ఆత్మ బంధువులు గురుస్వామి, ఓమేశ్వరరెడ్డి తెలిపారు.

నగర పంచాయతీ అభివృద్ధికి చర్యలు

బేతంచెర్ల: నగర పంచాయతీలోని కాలనీలను దశలవారిగా అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డితెలిపారు. పట్టణంలోని కోటపేట కాలనీల్లోని కందకం దగ్గర 2.8 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు పరిపాలన అనుమతులు వచ్చాయి. దీంతో పనులు ప్రారంభించేందుకు నగర పంచాయతీ కమిషనర్, చైర్మన్, మద్దిలేటిస్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు ఆ ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు.

ఆదిమానవుని ఉనికి పరిసరాల పరిశీలన

అవుకు: మండల కేంద్రం అవుకు పట్టణానికి చెందిన యువకుడు పల్లె విజయకుమార్ తన మిత్రులతో కలిసి కునుకుంట్ల గ్రామ పరిధిలోని ఎర్రమల కొండల్లో ఆదిమానవులు సంచరించినట్లు పరిశోధనలు చేసిన విషయం తెలిసిందే. దాదాపు తొమ్మిదేళ్లుగా చేసిన పరిశోధనల్లో 4వేల సంవత్సరాల క్రితమే ఇక్కడ ఆదిమానవులు జీవనం సాగించినట్లు, 2,300 రాతి చిత్ర ఆనవాళ్లు, 92 గుహల్లో ఆదిమానవులు నివసించిన ఆధారలను సేకరించి పురావస్తుశాఖకు పంపించారు. దీంతో పల్లె విజయకుమార్ మిత్ర బృందానికి ఈ ఏడాది జూలై 31వ తేదీన పురావస్తు శాఖ గుర్తింపుగా ప్రసంశాన్ని అందజేసింది.ఈ మేరకు గురువారం అవుకు మండలంలో ఆదిమానవుల ఉనికికి సంబంధించిన పరిసరాలను పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రజిత విజయకుమార్ మిత్ర బృందంతో కలిసి పరిశీలించారు.



చిత్రాలను పరిశీలిస్తున్న అధికారులు